


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
08-10-2025
పేజీలు: 02




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీకి దూరంగా ఉండాలని, ఎవరికీ మద్దతు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు చంద్రబాబు. అయితే, నిన్న(మంగళవారం) అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన నేతలతో చంద్రబాబు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
నిన్న(మంగళవారం) రాత్రి పొద్దుపోయేవరకూ తెలంగాణ తెలుగుదేశం నేతలతో ఈ సమావేశం కొనసాగింది. పోటీకి పార్టీ శ్రేణులు సమాయత్తంగా లేరన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఏ పార్టీకి మద్దతు ఇవ్వరాదని చర్చల్లో నిర్ణయం తీసుకున్నారు చంద్రబాబు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల మధ్య ఏపీలో పొత్తు ఉన్నందున.... తెలంగాణలో బీజేపీకి వ్యతిరేకంగా వెళ్లలేమని నేతలకు స్పష్టం చేశారు చంద్రబాబు. బీజేపీ మద్దతు అడిగితే కలిసి పని చేయాలని.. లేదంటే తటస్థంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు మాత్రం మద్దతిచ్చేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల్లో టీడీపీ పట్ల అభిమానం ఉందని.. జనంలో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## చదువుతో పాటు ఆరోగ్యం, విలువలు ముఖ్యం: సమంత

నటి సమంత తాజాగా సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, జీవిత విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తాను పాఠశాలలో నేర్చుకున్న స్నేహం, దయ, సానుభూతి వంటి లక్షణాలే జీవితంలో ఉపయోగపడ్డాయని తెలిపారు. 2023లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయని, మహారాష్ట్రలో అత్యధిక కేసులు నమోదయ్యాయని తెలిపే వార్తను పంచుకుని విచారం వ్యక్తం చేశారు. తన కొత్త తెలుగు సినిమా షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుందని శుభవార్త అందించారు.



# హద్దు మీరితే తోక కట్ చేస్తాం..
# వైసీపీకి గంటా వార్నింగ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటనపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రేపు (గురువారం) జగన్ విశాఖకు వచ్చి నర్సీపట్నం మెడికల్ కాలేజ్‌కు వెళ్తామని అంటున్నారని.. ఎయిర్ పోర్ట్ నుంచి నర్సీపట్నం వరకు 63 కిలో మీటర్లు రోడ్ షో వేయాలని వైసీపీ ప్లాన్ చేసిందన్నారు. చాలా దూరం కాబట్టి హెలికాప్టర్‌లో వెళ్ళమని పోలీసులు చెప్పారని తెలిపారు. వైసీపీ హయాంలో పాలన ఎలా జరిగిందో అందరికీ తెలిసిందే అని చెప్పుకొచ్చారు. ఎయిర్ పోర్ట్‌లో ఆనాడు చంద్రబాబును అడ్డుకున్నారని.. పవన్ కళ్యాణ్‌ను అడ్డుకున్నట్లు తాము చేయగలమన్నారు. కానీ అలా చేయమని.. జగన్ పర్యటనకు అనుమతులు ఇచ్చామన్నారు. గతంలో కూడా ఏపీలో చాలా చోట్ల జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని.. ఎలాంటి సంఘటనలు జరిగాయో అందరికీ తెలుసని మాజీ మంత్రి అన్నారు. జగన్ తన పర్యటనలో లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందులు కలిగించారని విమర్శించారు. విశాఖలో మహిళల క్రికెట్ మ్యాచ్ ఉందని... ఇటువంటి సమయంలో జగన్ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు కట్టాలని అనుకున్నారని తెలిపారు. నర్సీపట్నం మెడికల్ కాలేజ్ పునాది స్థాయిలో ఉంటే.. వైసీపీ కార్యాలయాలు మాత్రం మహారాజ ప్యాలెస్‌లా కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రుషికొండలో ప్రజా ధనంతో ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. జగన్ కల్తీ మద్యం కోసం మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని దుయ్యబట్టారు. తమిళనాడులో విజయ్ కార్యక్రమంలో 40 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎవరు అడ్డుకుంటారో చూస్తామంటే.. మక్కెలు ఇరగ కొడతామని మాజీ మంత్రి హెచ్చరించారు.





## బాలికతో వ్యభిచారం.. హాస్య నటుడు సహా ఆరుగురి అరెస్ట్!

తమిళనాడు రాజధాని చెన్నైలో మానవత్వాన్ని కలచివేసే ఓ ఘటన వెలుగు చూసింది. స్థానిక వంద అడుగుల రోడ్డులోని ఓ వసతి గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు కోయంబేడు మహిళా పోలీసులు గృహంపై దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలికను రక్షించి కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తులో పోలీసులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సినీ సహాయనటి నాగలక్ష్మి, మరో నటి అంజలి, కార్తిక్, కుమార్‌లను అరెస్టు చేసి విచారించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తండ్రి మృతి తర్వాత బాలిక తల్లి మరో వ్యక్తిని వివాహం చేసుకోవడంతో, ఆ బాలిక తల్లి స్నేహితురాలైన క్లబ్ డ్యాన్సర్ పూంగొడి, ఆమె స్నేహితురాలు ఐశ్వర్య వద్దకు చేరిందని పోలీసులు తెలిపారు. ఈ ఇద్దరూ బాలికను వలలో వేసి, హాస్య నటుడు భారతి కన్నన్, అతని స్నేహితులు మహేంద్రన్, రమేష్ సహకారంతో వ్యభిచారం చేయించి డబ్బు సంపాదించినట్లు విచారణలో బయటపడింది. పోలీసులు మంగళవారం పూంగొడి, ఐశ్వర్యలను అరెస్టు చేశారు. అదేవిధంగా భారతి కన్నన్, మహేంద్రన్, రమేష్‌లను పోక్సో (POCSO) చట్టం కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనతో సినీ, సామాజిక వర్గాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. మైనర్ బాలికను ఈ దారుణానికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## విజయ్.. ఓ జోకర్! ఆయన్ని.. తప్పుపట్టొద్దు



తమిళ హీరో, 'తమిళగ వెట్రి కళగం' అధ్యక్షుడు విజయ్‌ను హీరోయిన్ శృతిహాసన్ ఓ జోకర్‌తో పోల్చారు. ఇటీవల జరిగిన కరూర్ తొక్కిసలాట వల్ల 41 మంది మరణించిన ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ. 'ఓ జోకర్ సర్కస్‌కు వెళ్లడం వల్లే ఆ ఘోరం జరిగింది' అంటూ ఆమె తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. విజయ్ ఒక జోకర్.. జోకర్‌గానే ఆయన నడుచుకున్నారని, అందువల్ల ఆయన్ని తప్పుపట్టరాదన్నారు. సర్కస్‌కు పోయిన వారినే వేలెత్తి చూపాలన్నారు. అయితే ఈ పోస్టు చేసిన కాసేపటికి దానిని తొలగించినప్పటికీ అప్పటికే అది కాస్త సామాజిక మాధ్యమాల్లోకి ఎక్కి హాల్ చల్ చేసింది. ఇదిలా ఉండగా కరూర్ దుర్ఘటనలో మృతి చెందిన కొంతమంది కుటుంబీకులతో విజయ్ సోమవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జరిగిన నష్టం పూడ్చలేనిదని, కానీ జీవితాంతం తాను అండగా ఉంటానని విజయ్ వారిని ఓదార్చారు. అయితే విజయ్, శృతి హాసన్ జంటగా గతంలో పులి అనే సినిమాలో కలిసి నటించడం విశేషం.


## దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసాల్లో ఈడీ సోదాలు

ప్రముఖ నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్, అమిత్ చకల్‌కల్ నివాసాల్లో ఈడీ సోదాలు చేస్తోంది. లగ్జరీ కార్ల స్మగ్లింగ్ ఆరోపణలకు సంబంధించి ED అధికారులు ఈ దర్యాప్తు చేస్తున్నారు. ఇక, ఈ కేసు మూలాల్లోకి వెళ్తే, భూటాన్ ఆర్మీ ఇటీవల తన వాహనశ్రేణిలోని కొన్ని ఖరీదైన వాహనాలను తీసివేసింది. ఆ ఖరీదైన కార్లను కొందరు ఏజెంట్లు వేలంలో అతి తక్కువ ధరకు దక్కించుకున్నారు. వాటిని ఎలాంటి కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండా భారత్‌కు స్మగ్లింగ్ చేశారన్న సమాచారం ఈడీకి చేరింది. సినీ, వ్యాపార వర్గాల్లోని కొందరిని గుర్తించి వారికి మాత్రమే ఈ కార్లను విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ఇలా ఉండగా, కార్ల స్మగ్లింగ్ వ్యవహారం తెలంగాణాను తాకింది. ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్ల స్మగ్లింగ్ గురించి ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. కార్ పార్టీ (బీఆర్ఎస్) అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తుందా? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆ సమయంలో ప్రశ్నించారు. 'లగ్జరీ కార్ల కుంభకోణం నిందితుడు బసరత్ ఖాన్ అక్రమంగా దిగుమతి చేసుకున్న ల్యాండ్ క్రూజర్లలో ఒకదాంట్లో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నారు? ఆ కారు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీ పేరుతో ఎందుకు రిజిస్టర్ అయింది? మార్కెట్ ధర చెల్లించారా? లేదంటే ధర తక్కువగా చూపించి కొనుగోలు చేశారా? చెల్లింపులు బినామీ పేర్లతో జరిగాయా? మనీలాండరింగ్ జరిగిందా? అని నిలదీశారు. ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందినట్లు కాదా?' అని సంజయ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.




## బీసీ రిజర్వేషన్లపై విచారణ వాయిదా

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. విచారణ ప్రారంభమైన కాసేపటికే వాయిదా వేస్తూ ధర్మాసనం ప్రకటించింది. తిరిగి ఇవాళ మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేసింది హైకోర్టు. తొలుత విచారణ ప్రారంభమవగానే.. రిజర్వేషన్లపై ప్రస్తుత ఏంటని ప్రశ్నించింది హైకోర్టు. సుప్రీంకోర్టులో జరిగిన విచారణపైనా హైకోర్టు ధర్మాసనం ఆరా తీసింది. అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారిస్తామని పేర్కొన్న ధర్మాసనం.. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. కాగా, బీసీ రిజర్వేషన్లపై 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను కలిపి మధ్యాహ్నం హైకోర్టు విచారించనుంది. ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించనున్నారు. కాగా, బీసీ రిజర్వేషన్లపై అంశంపై తెలంగాణ హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో అని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపనుంది. హైకోర్టు నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల భవితవ్యం తేలనుంది. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం.. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి అవకాశం లేదు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రిజర్వేషన్లు 67 శాతానికి పెరిగాయి. బీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించింది ప్రభుత్వం. హైకోర్టు ఒకవేళ ఈ జీవోను కొట్టివేస్తే స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడే అవకాశం ఉంది.



## పెనంతో కొట్టి చంపిన కోడలు

మందులకు, తిండికి డబ్బులు అడుగుతోందని అత్తను హతమార్చింది కోడలు.. ఆపై ఆ హత్యను సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం బెడిసి కొట్టడంతో కటకటాల పాలయ్యింది. కుటుంబ సభ్యుల అనుమానం, పోలీసుల ఎంట్రీతో అత్త హత్య కహానీ వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో ఈ దారుణ ఘటన జరిగింది. వృద్ధాప్యంలో ఉన్న అత్తకు సేవ చేయాల్సిందిపోయి ఓ కోడలు అత్తపై విచక్షణారహితంగా దాడిచేసి హత్య చేసింది. వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దొడ్డి ఎల్లమ్మ ఆమె కుమారుడు మల్లయ్య, కోడలు దొడ్డి బొగురమ్మ వద్ద నివాసం ఉంటోంది. కొన్నాళ్ల క్రితం ఎల్లమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఇంటివద్దే చికిత్స తీసుకుంటోంది. ఈ క్రమంలో మందులు,



తిండి కోసం తరచూ కొడుకు, కోడలను డబ్బులు అడుగుతోంది. అయితే, పదే పదే డబ్బులు అడగడం కోడలు బొగురమ్మకు విసుగు తెప్పించింది. ఈ అంశంలోనే తరచూ అత్త, కోడళ్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అత్తను మొత్తానికే తుదిముట్టిస్తే ఎలాంటి వేధింపులు, గొడవలు ఉండవని నిర్ధారించుకుంది. ఈ నెల 4వ తేదిన మధ్యాహ్నం ఇరుగుపొరుగు ఎవరూ లేని సమయం చూసుకొని అత్త హత్యకు స్కెచ్ వేసింది. కర్ర, రొట్టె పెంకతో అత్త ఎల్లమ్మపై విచక్షణారహితంగా దాడి చేసింది. గాయాలు తాళలేక అత్త అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# మినరల్ వాటర్ మంచిదేనా? TDS స్థాయిలు తక్కువైతే నష్టమే!

నేటి ఆధునిక జీవనశైలిలో, దాదాపు ప్రతి ఇంట్లో వాటర్ ప్యూరిఫయర్ అనేది తప్పనిసరిగా మారింది. మినరల్ వాటర్ లేదా ప్యూరిఫై చేసిన నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదని చాలా మంది భావిస్తారు. అయితే, శ్రద్ధ వహించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే, నీటి స్వచ్ఛతతో పాటు అందులో ఉండాల్సిన ఖనిజాలు. నీటిని శుద్ధి చేసే క్రమంలో, ప్యూరిఫయర్లు నీటిలోని హానికరమైన కాలుష్య కారకాలను తొలగించడంతో పాటు, ముఖ్యమైన ఖనిజ లవణాలను (Minerals) కూడా తగ్గించేస్తున్నాయి. అందుకే నిపుణులు, కేవలం స్వచ్ఛమైన నీరే కాదు, సరైన TDS (Total Dissolved Solids) స్థాయిలు ఉన్న నీటినే తాగాలని పదే పదే సూచిస్తున్నారు.
నీటిలో కరిగి ఉన్న ఖనిజ లవణాలు, అకర్బన లవణాలు వంటి వాటిని TDS అని అంటారు. వైద్యులు మరియు ఆరోగ్య సంస్థల సూచనల ప్రకారం, మనం తాగే నీటిలో ఈ TDS స్థాయిలు ఒక పరిమితికి మించి ఉండకూడదు. భారతీయ ప్రమాణాల సంస్థ (BIS) ప్రకారం, తాగే నీటిలో TDS గరిష్ఠంగా 500 mg/L వరకు ఉండవచ్చు. అయితే, ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రకారం, 300 mg/L కంటే తక్కువ ఉంటే అత్యుత్తమమని, 300-600 mg/L మధ్యలో ఉంటే మంచిదని చెబుతోంది. ఈ పరిమితులను పాటించడం వల్ల నీరు రుచిగా ఉండటమే కాకుండా, శరీరానికి అవసరమైన ఖనిజాలు కూడా అందుతాయి.
అనేక రివర్స్ ఆస్మోసిస్ (RO) ప్యూరిఫయర్లు నీటిలోని TDS స్థాయిలను విపరీతంగా తగ్గించేస్తాయి. కొన్నిసార్లు ఈ స్థాయిలు 50 mg/L కంటే కూడా తక్కువకు పడిపోతాయి. అతిగా శుద్ధి చేసిన ఈ నీటిని తాగడం వల్ల మెగ్నీషియం, కాల్షియం వంటి అత్యంత ముఖ్యమైన ఖనిజాలను మన శరీరం కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ ఖనిజాలు మన ఎముకల ఆరోగ్యానికి, గుండె పనితీరుకు, నాడీ వ్యవస్థకు కీలకం. TDS చాలా తక్కువగా ఉన్న నీరు తాగడం వల్ల రుచిలో తేడా రావడంతో పాటు, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
మనం వాడే వాటర్ ప్యూరిఫయర్ TDS స్థాయిలను



నియంత్రించే సామర్థ్యం కలిగి ఉందో లేదో తెలుసుకోవాలి. ఆధునిక ప్యూరిఫయర్‌లలో TDS కంట్రోలర్ అనే వ్యవస్థ అందుబాటులో ఉంది. దీని ద్వారా, ప్యూరిఫై అయిన నీటిలో TDS స్థాయిలు అవసరమైన మేరకు, అంటే 100 నుండి 300 mg/L మధ్య ఉండేలా మనం సెట్ చేసుకోవచ్చు. కాలుష్య రహిత స్వచ్ఛమైన నీటిని తాగుతూనే, ముఖ్యమైన ఖనిజాలను కూడా శరీరానికి అందించడానికి ఈ నియంత్రణ చాలా అవసరం. కాబట్టి, కేవలం శుద్ధి చేయడంపైనే కాకుండా, ఆ శుద్ధి చేసిన నీటి నాణ్యత (TDS స్థాయి) పైనా దృష్టి పెట్టాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.




## నార్త్ అమెరికాలో కాంతార చాప్టర్ 1 ప్రభంజనం

పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ''కాంతార'' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ''కాంతార చాప్టర్ 1'' మరోసారి ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంటోంది. రిషబ్ శెట్టి హీరోగా, దర్శకుడిగా తనదైన శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా నార్త్ అమెరికా బాక్సాఫీస్ వద్ద ''కాంతార చాప్టర్ 1'' సత్తా చాటింది. $3 మిలియన్ గ్రాస్ (దాదాపు ₹25 కోట్లకు పైగా) వసూలు చేసి, స్ట్రాంగ్ హోల్డ్‌తో దూసుకెళ్తోంది. పలు ప్రాంతాల్లో వసూళ్లలో నిలకడను చూపిస్తున్న ఈ చిత్రం, యూఎస్ మార్కెట్లో సైతం లాంగ్ రన్ చూసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేవలం కమర్షియల్ ఓరియంటెడ్ కథే కాదు, భక్తి, సామాజికత, కల్చరల్ డెప్త్ ఉన్న కథనంతో ''కాంతార చాప్టర్ 1'' విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంటోంది. రిషబ్ శెట్టి నటనతో పాటు డైరెక్షన్‌లోనూ మరోసారి తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు. ఇటీవల విడుదలైన సినిమాల్లో ''కాంతార చాప్టర్ 1'' వసూళ్ల పరంగా దూసుకెళ్తుండటంతో, ఈ చిత్రం మొత్తం కలెక్షన్ల పరంగా ఎంత రాబడుతుందనేది ఆసక్తికరంగా మారింది. రిషబ్ శెట్టి క్రియేట్ చేసిన ఈ క్రియేటివ్ యూనివర్స్ ఇంకా ఎన్ని చాప్టర్లు చూపించబోతుందన్నది కూడా సినీప్రియులలో చర్చనీయాంశంగా మారింది.



## బిహార్‌లో సీట్ల సర్దుబాట్లు: బీజేపీకి చిరాగ్ పాశ్వాన్ సూక్తి ముక్తావళి

బిహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్‌డీఏ కూటమిలో సీట్ల సర్దుబాటు పెద్ద టాస్క్ లా మారుతోంది. సీట్ల పంపకాలపై ఆయా పార్టీల మధ్య ఉద్విగ్నభరిత చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తాజాగా ఒక కీలక వ్యాఖ్య చేశారు. తన తండ్రి, లోక్‌జనశక్తి పార్టీ (రామ్ విలాస్) స్థాపకుడు రామ్ విలాస్ పాశ్వాన్ వర్ధంతి(అక్టోబర్ 8) రోజున తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఈ వ్యాఖ్య ఎన్‌డీఏలోని భాగస్వాముల మధ్య కొత్త చర్చకు దారితీస్తోంది. చిరాగ్ పాశ్వాన్ సదరు పోస్ట్‌లో.. తన తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ మాటల్ని ఉటంకించారు. 'పాపా ఎల్లప్పుడూ చెప్పేవారు, పాపం చేయకు, పాపం భరించకు. జీవించాలనుకుంటే, మరణించడం నేర్చుకో, ప్రతి అడుగులో పోరాటం చేయడం నేర్చుకో' అని రాశారు. దీనిపై బిహార్ లో రాజకీయ నేతలు తమ ఇష్టానికి నిర్వచిస్తున్నారు. కాగా, ఇటీవల పాట్నా ఎయిర్‌పోర్ట్‌లో చిరాగ్ ఎన్డీయే కూటమి సీట్ల పంపకాలపై నేరుగా మాట్లాడారు, 'సీట్ల షేరింగ్ చర్చలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు సమాచారం తెలియజేస్తాం' అని చెప్పారు. ఇలా ఉండగా, బిహార్ ఎన్‌డీఏ కూటమిలో బీజేపీ, జేడీయూ, ఎల్‌జేపీ-ఆర్‌వీ, హిందుస్తానీ అవామ్ మోర్చా వంటి మిత్ర పక్షాలు సభ్యులు గా ఉన్నాయి. వీటి మధ్య బిహార్ అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపిణీపై ఇంకా ఒప్పందం కుదుర్చుకోలేదు.

## మంత్రం వేస్తానంటూ.. యువతిని ముగ్గులోకి దించిన ఫేక్ బాబా

ఓ యువతిని ఫేక్ బాబా మోసగించాడు ఈ సంఘటన హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని నవాబ్ సాహెబ్ కుంటలో జరిగింది. ఈ కేసుకి సంబంధించిన వివరాలను పాతబస్తీ పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని నవాబ్ సాహెబ్ కుంటలో నివసించే కుటుంబానికి చెందిన ఒక యువతి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఇదే అదునుగా భావించిన నకిలీ బాబా వారి కుటుంబాన్ని మోసం చేశాడు. యువతికి మంత్రించి బాగుచేస్తానని చెబుతూ ఓ బాబా రోజూ ఇంటికి వచ్చేవాడు. మంత్రాలు వేస్తే ఆరోగ్యం మెరుగవుతుందనే నమ్మకంతో తల్లిదండ్రులు ఆ యువతిని ఆయన వద్దకు తరచూగా పంపించారు. ఒక దశలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువతిని దర్గాలో మంత్రిస్తే పూర్తిగా కోలుకుంటుందని నమ్మించి ఆమెను తీసుకెళ్లి తనతో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజుల పాటు కూతురు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పాతబస్తీ పోలీసులను ఆశ్రయించారు. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంతలో యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడింది. తాను మేజర్‌ని అని, ప్రేమించి స్వచ్ఛందంగా బాబాని వివాహం చేసుకున్నానని చెప్పింది. అంతేకాదు సమయం, సందర్భం చూసుకుని నిర్ణయం తీసుకున్నానని, అంతా తన ఇష్టపూర్వకంగానే



జరిగిందంటూ క్లారిటీ ఇచ్చింది. యువతి స్వచ్ఛందంగా వెళ్లిందని తెలిసిన వెంటనే మిస్సింగ్ కేసును పాతబస్తీ పోలీసులు క్లోజ్ చేశారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే బాబాకి ఇది వరకే పెళ్లయి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని చెబుతున్నారు పోలీసులు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. తమ కూతురు తిరిగి తమ దగ్గరికి రావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మాయ మాటలు చెప్పి మంత్రాల పేరిట యువతిని ప్రభావితం చేసిన బాబాని కఠినంగా శిక్షించాలని యువతి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## జగన్ పర్యటనని అడ్డుకుంటాం.. దళిత సంఘాల స్ట్రాంగ్ వార్నింగ్

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నర్సీపట్నం పర్యటనను అడ్డుకుంటామని దళిత సంఘాలు తీవ్రంగా హెచ్చరించాయి. జగన్ నర్సీపట్నంలో అడుగు పెట్టే ముందు, దివంగత డాక్టర్ సుధాకర్ తల్లికి, వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డాక్టర్ సుధాకర్ మరణానికి జగనే కారణమని, ఇది ప్రపంచానికి తెలిసిన నిజమని దళిత సంఘాలు ఆరోపించాయి. ఒక మాస్క్, పీపీఈ కిట్ అందించలేక డాక్టర్ సుధాకర్‌ను బలిగొన్న జగన్, ఇప్పుడు నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ కడతానంటే ప్రజలు నమ్మరని విమర్శించారు. ఒక వైద్యుడి ప్రాణాలనే కాపాడలేని వారు, మెడికల్ కాలేజీ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్‌కు జరిగిన అన్యాయంపై, ఆయన మృతిపై ఇంతవరకు న్యాయం జరుగలేదని



చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ సుధాకర్ కుటుంబానికి జగన్ క్షమాపణ చెప్పని పక్షంలో.. దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆయన పర్యటనను అడ్డుకుని తీరుతామని దళిత సంఘాలు హెచ్చరించాయి.

## రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు.. ప్రముఖ సింగర్ మృతి

చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. ఇటీవలే సింగపూర్‌లో అస్సాం గాయకుడు జుబీన్ గార్గ్ మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణవార్త మరవకముందే పంజాబీ సింగర్ రాజ్‌వీర్ జవందా ప్రాణాలు కోల్పోయారు. రాజ్‌వీర్ జవందా గతనెల 27న బైక్‌పై హిమాచల్ ప్రదేశ్ సిమ్లాకు బయల్దేరారు. బద్ది ప్రాంతంలో ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో రాజ్‌వీర్ జవందా తల, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో గాయకుడు గుండెపోటుకు కూడా గురైనట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇక గత 11 రోజులుగా మొహాలీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజ్‌వీర్ జవందా.. ఈరోజు ఆరోగ్యం విషమించి తుదిశ్వాస విడిచారు. ఈ



విషయాన్ని పంజాబీ నటి నీరూ బజ్వా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రాజ్‌వీర్ వయసు ప్రస్తుతం 35. ఆయన మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా సంతాపం తెలియజేస్తున్నారు.



## 9 సిక్సర్లు, 133 పరుగులతో సూర్యవంశీ బీభత్సం

భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాతో జరిగిన రెండు మ్యాచ్‌ల అండర్-19 టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. రెండో మల్టీ-డే మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారత్‌కు 81 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనిని భారత్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి సాధించింది. మొత్తంxe భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాపై సిరీస్ విజయం సాధించింది. 14 ఏళ్ల స్టార్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కూడా ఈ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 133 పరుగులు చేశాడు.
9 సిక్సర్లతో 133 పరుగులు..
ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన రెండు మ్యాచ్‌ల మల్టీ-డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ 9 సిక్సర్లు, 11 ఫోర్లతో సహా 133 పరుగులు చేశాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లోని మూడు ఇన్నింగ్స్‌లలో అతను ఈ పరుగులు చేశాడు. మొదటి మల్టీ-డే మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో, వైభవ్ సూర్యవంశీ 86 బంతులు ఎదుర్కొని 8 సిక్సర్లు, 9 ఫోర్లతో సహా 113 పరుగులు చేశాడు. రెడ్-బాల్ క్రికెట్‌లో ఇది అతని అత్యధిక స్కోరు. రెండవ మల్టీ-డే మ్యాచ్‌లో, వైభవ్ సూర్యవంశీ రెండు ఇన్నింగ్స్‌లలో ఒక సిక్స్, రెండు ఫోర్లతో సహా కేవలం 20 పరుగులు మాత్రమే చేశాడు. ఈ విధంగా, ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన మొత్తం సిరీస్‌లో, అతను తొమ్మిది సిక్స్‌లతో 133 పరుగులు చేశాడు.



## హాట్ బ్యూటీ రకుల్

అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ బ్యూటీ తెలుగులో అంతగా సినిమాలు చేయకపోయినప్పటికీ,సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన అంద చందాలతో అందరినీ దోచేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ హాలీవుడ్ బ్యూటీలా రెడీ అయ్యి, తన అందంతో అందరినీ ఆకట్టుకుంటుంది. మరి మీరు చూసెయ్యండి ఆఫొటోస్!బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఇక ఈ నటి వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన నటన, అందంతో ఎంతో మంది మదిని దోచుకుంది. ఈ మూవీతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది.ఇక ఈ సినిమా తర్వాత ఈ బ్యూటీకి వరసగా అవకాశాలు తలుపు తట్టాయి. ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోల సరసన ఛాన్స్ కొట్టేసింది.